
సాక్షి
బాపట్ల
ఆదివారం । 19 । జనవరి । 2025




వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు

మాచర్ల: పట్టణంలో బస్టాండ్ సెంటర్‌లో వేంచే సియున్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం అడిగొప్పల చెన్నకేశవాచార్యులుచే అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శనివారం 1818 క్యూసెక్కులు విడుదల చేశారు. నిజాం పట్నం కాలువకు 110 క్యూసెక్కులు వదిలారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 561.10 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 9,800 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా అశోక్‌బాబు



వేమూరు: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా వరికూటి అశోక్‌బాబు నియమితులయ్యారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఉత్తర్వులు వెలువడ్డాయి. అశోక్‌బాబు 2014 నుంచి ప్రకాశం జిల్లా కొండేపి నియోజకవర్గం ఇన్‌చార్జిగా పని చేస్తున్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు 2024లో వేమూరు నియోజకవర్గం వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీచేసి ఓటమి చెందారు. ప్రస్తుతం నియోజకవర్గం సమన్వయకర్తగా పనిచేస్తున్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ స్థాపించిన నాటి నుంచి పనిచేస్తున్నారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు ఉంటుందనే దానికి తన నియామకమే నిదర్శనం అని అశోక్‌బాబు అన్నారు.

సాయిబాబా మందిరంలో చోరీ

సంతమాగులూరు (అద్దంకి రూరల్): మండలంలోని వెల్లల చెరువు గ్రామంలోని సాయిబాబా మందిరంలో శుక్రవారం రాత్రి చోరీ జరగ్గా శనివారం వెలుగులోకి వచ్చింది. పూజారి ఫిర్యాదుతో ఎస్సై పట్టాభి రామయ్య కేసు నమోదు చేశారు. వెల్లల చెరువు గ్రామంలోని అడవిపాలెం వెళ్లే రోడ్డులో ఉన్న సాయిబాబా మందిరంలో పూజారి నాగలింగం సౌభాగ్య శర్మ ఎప్పటిలాగే శుక్రవారం సాయంత్రం పూజల అనంతరం రాత్రి 7 గంటలకు తాళాలు వేసి ఇంటికి వెళ్లాడు. శనివారం ఉదయం రెండు గదులు తెరచి ఉన్నాయి గమనించిన పూజారి గదిలోకి వెళ్లి చూడగా సీసీ కెమెరాకు వినియోగించే రూ. 5వేలు విలువ కలిగిన డీవీఆర్ బాక్స్ కనిపించలేదు. ఇనుప బీరువాను పగులగొట్టేందుకు ప్రయత్నించినట్లు అనుమానం రావడంతో పూజారి స్టేషన్‌కు వచ్చి దొంగతనం జరిగినట్లు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై కేసు నమోదు చేశారు.

హస్తినాపురంలో దొంగల బీభత్సం



చీరాల: చీరాల మండలం దేవాంగపురి పంచాయతీ హస్తినాపురంలో దొంగలు బీభత్సం సృష్టించారు. తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేసుకొని లూటీ చేశారు. పక్కపక్కనే ఉన్న ఇళ్లను దొంగలు టార్గెట్ చేసుకుని అందినకాడికి దోచుకెళ్లారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు... స్థానికంగా నివాసముంటున్న పృధ్వీ వసుంధర శుక్రవారం తన నివాసం సమీపంలోనే ఉన్న తల్లి ఇంటి వెళ్లి తిరిగి తెల్లవారుఝామున ఇంటికి వచ్చింది. తాళాలు పగలకొట్టి ఉండడంతో ఇంటిలోకి వెళ్లి చూడగా బీరువా పగలకొట్టి వస్త్రాలు చిందరవందరగా పడవేశారు. ఇంట్లో దాచుకున్న 12 సవర్ల బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయని పోలీసులకు ఫిర్యాదు చేసింది. అలానే ఇంటి పక్కనే నివాసముంటున్న పసుమర్తి వీరవెంకట సత్యనారాయణ ఇంట్లో కూడా చోరీ జరిగింది. ఇంటి యజమాని సంక్రాంతి సెలవులకు మంగళగిరిలోని బంధువుల ఇంటికి వెళ్లి వచ్చేసరికి తాళాలు పగలకొట్టి ఉన్నాయి. ఇంటిలో దాచుకున్న బంగారపు ఉంగరంతోపాటు వెండి వస్తువులు అపహరణకు గురయ్యాయి. రెండు ఘటనలపై పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. క్లూస్ టీం సభ్యులు ఇళ్లను పరిశీలించారు. సంఘటనా స్థలాన్ని ఒన్‌టౌన్ సీఐ ఎం.శ్రీనివాసరావు పరిశీలించారు. చోరీలపై బాధితుల వద్ద నుంచి వివరాలను సేకరించారు.

లక్ష్మీ నరసింహస్వామికి రూ. 55,78,843 ఆదాయం

మంగళగిరి(తాడేపల్లి రూరల్): మంగళగిరిలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం ఎగువ సన్నిధి, దిగువ సన్నిధి, శ్రీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం హుండీల లెక్కింపును శనివారం లక్ష్మీ నరసింహస్వామి ఆలయ ఆవరణలో లెక్కించారు. మొత్తం ఆదాయం రూ.55,78,843 వచ్చిందని ఆలయ కార్యనిర్వహణాధికారి రామకోటిరెడ్డి వెల్లడించారు. ఇందులో లక్ష్మీ నరసింహస్వామి దేవస్థాన ఎగువ సన్నిధిలో రూ. 24,87,319, దిగువ సన్నిధిలో రూ. 29,93,901, శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో రూ. 62,250, అన్నదాన సత్రంలోని హుండీ ద్వారా రూ. 33,373 వచ్చినట్లు ఆయన తెలిపారు. గతంలో కంటే ఈ ఏడాది రూ. 5,71,509 అధికంగా వచ్చిందని పేర్కొన్నారు. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని శ్రీ సహస్ర లింగేశ్వరస్వామి దేవస్థానం, పొన్నూరు కార్యనిర్వహణాధికారి జి. వెంకట అమర్ పర్యవేక్షించారు.

మిర్చి ధర ఢమాల్

- ఈ ఏడాది రూ.10 నుంచి రూ.12 వేలు
- తెగుళ్లతో సగానికి తగ్గిన దిగుబడి
- గతేడాది 31,826.77 ఎకరాల్లో మిర్చి సాగు
- ఈ ఏడాది 16,986.51 ఎకరాల్లో సాగు
- గతంలో ఎకరానికి 30 క్వింటాళ్ల దిగుబడి
- ఈ ఏడాది 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి
- ఎకరానికి రూ.1.80 లక్షల పెట్టుబడి
- ఆందోళనలో అన్నదాతలు

గత ఐదేళ్లలో క్వింటాల్ ధర రూ.22 నుంచి రూ.24 వేలు



యద్దనపూడి మండలంలో మిర్చి పంట

సాక్షి ప్రతినిధి, బాపట్ల: మిర్చి రైతులు కుదేలయ్యారు. గతంతో పోలిస్తే ఈ ఏడాది మిర్చి పంటకు అధికంగా తెగుళ్లు సోకాయి. ఎన్ని రకాల పురుగుమందులు పిచికారీ చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో పంట పూర్తిగా దెబ్బతింది. గతంతో పోలిస్తే దిగుబడిలో 60 శాతం తగ్గనుంది. మరోవైపు మిర్చి ధరలు పూర్తిగా పడిపోయాయి. గతేడాదితో పోలిస్తే సగానికంటే తక్కుగా ధరలు తగ్గాయి. దీంతో పెట్టుబడుల సంగతి దేవుడెరుగు కూలీల ఖర్చులు కూడా రావని రైతులు లబోదిబోమంటున్నారు.

ఎకరానికి రూ.1.80 లక్షల పెట్టుబడి

రైతులు ఎకర మిర్చి సాగుకు రూ.1.80 లక్షల పెట్టుబడులు పెట్టారు. ఇందులో రూ.35 వేలు కౌలుకు వెచ్చిస్తుండగా రూ.70 వేలు పురుగుమందుల కోసం ఖర్చు చేశారు. రసాయనిక ఎరువులు, నారు, సేద్యం, కూలీల ఖర్చులు మరో రూ.70 వేల వరకూ అవుతున్నాయి. కాయ కోత కూలి, ఆరబెట్టడం, గ్రేడింగ్ ఖర్చు క్వింటాల్‌కు రూ.5 వేలు అవుతోంది. ఈ లెక్కన ఎకరానికి పెట్టుబడి రూ.1.80 లక్షలకు తగ్గకుండా అవుతోందని రైతులు లెక్కలు చెబుతున్నారు.

సగానికిపైగా తగ్గిన దిగుబడి

గతంలో ఎకరానికి 30 క్వింటాళ్లకు తగ్గకుండా దిగుబడి వచ్చేది. ఈ ఏడాది తెగుళ్ల ఉధృతికి ఎకరానికి 7 నుంచి 10 క్వింటాళ్లకు మించి దిగుబడి రాదని రైతులు అంచనా వేస్తున్నారు.

పడిపోయిన ధరలు

ఈ ఏడాది ధరలు మరింతగా పతనమయ్యాయి. ప్రారంభంలో మిర్చి క్వింటాల్ రూ.15 వేల వరకూ ఉన్నా ప్రస్తుతం రూ.12 నుంచి రూ.13 వేలకు తగ్గింది. గతేడాది నాటు రకం మిర్చి క్వింటాలు రూ.27 వేలు ఉండగా ఈ ఏడాది రూ.10 వేలకు మించి లేదు. తేజ రకం గతేడాది రూ.22 వేల నుంచి రూ.24 వేలు అమ్మగా, ఈ ఏడాది రూ.12 వేలకు మించి లేదు. సూపర్-10 రకం మిర్చి గతేడాది రూ.20 వేలకు తగ్గకుండా ధర ఉండగా ఈ ఏడాది రూ.8 నుంచి 10 వేలు మాత్రమే ఉంది. తెగుళ్ల వల్ల తాలు అధికంగా ఉండడంతో మిక్సిడ్ తాలు రకం మిర్చి క్వింటాల్ రూ.4 నుంచి 6 వేలు మాత్రమే ధర పలుకుతోంది.

డివిజన్ పేరు	2023-24	2024-25
	(ఎకరాల్లో)	(ఎకరాల్లో)
అద్దంకి సబ్ డివిజన్	4059.56	1581.16
బాపట్ల సబ్ డివిజన్	8.13	427.28
చీరాల సబ్ డివిజన్	1143.77	262.23
మార్టూరు సబ్ డివిజన్	11,229.23	6938.20
పర్చూరు సబ్ డివిజన్	15,382.16	7782.64
రేపల్లె సబ్ డివిజన్	3.92	00.0
	31,826.77	16,986.51



తెగులు సోకి దెబ్బతిన్న మిర్చి మొక్క

తీవ్రంగా నష్టాలు



గతేడాది 15 ఎకరాల్లో మిర్చి సాగుచేశాను. తెగుళ్లు సోకడంతో పదెకరాలు దున్నేశాను. మిగిలిన ఐదెకరాల్లో ఎకరాకు ఆరు క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వచ్చింది. ఈ ఏడాది రెండు ఎకరాల్లో మిర్చి సాగుచేశాను. మొదటి నుంచి తామర పురుగు, ఇతర తెగుళ్లు సోకాయి. ఇప్పటికే ఎకరాకు రూ.లక్షకు పైగా పెట్టుబడి పెట్టాను. దిగుబడి ఎకరాకు ఆరేడు క్వింటాళ్లకు మించి వచ్చే పరిస్థితి లేదు. ధరలు గతేడాదికంటే సగం తగ్గాయి. పెట్టుబడులు కూడా రావు.

–గనిపిశెట్టి వెంకట్రావు, చిమటావారిపాలెం, యద్దనపూడి మండలం

ధర లేదు.. నష్టాలే

గతేడాది 20 ఎకరాలలో మిర్చి వేశాను. తుఫానుతో ఎకరాకు 4 క్వింటాళ్లకు మించి దిగుబడి రాలేదు. అయితే క్వింటాల్ ధర రూ.18 వేలు ఉంది. ఈ ఏడాది 12 ఎకరాల్లో వేశాను. ఎకరాకు ఇప్పటికి రూ.లక్షకు పైగా ఖర్చు పెట్టాను. తెగుళ్లు అధికంగా ఉన్నాయి. 10 క్వింటాళ్లకు మించి దిగుబడి వచ్చేలా లేదు. ధరలు పూర్తిగా పడిపోయాయి.

–మున్నంగి అంజిరెడ్డి, మున్నంగివారిపాలెం, యద్దనపూడి మండలం

సగానికి తగ్గిన సాగు

ప్రతి ఏటా తెగుళ్లు అధికం కావడంతో జిల్లాలో మిర్చిసాగు సగానికి సగం తగ్గింది. గతేడాది జిల్లాలోని అద్దంకి, బాపట్ల, చీరాల, మార్టూరు, పర్చూరు, రేపల్లె సబ్ డివిజన్ల పరిధిలో 31,826.77 ఎకరాల్లో మిర్చిపంట సాగు కాగా ఈ డాది పై డివిజన్ల పరిధిలో 16,986.51 ఎకరాల్లో మాత్రమే సాగుచేశారు.

పరిసరాల పరిశుభ్రతే లక్ష్యంగా ముందుకు..

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి



బాపట్ల:పరిసరాలు–పరిశుభ్రతే లక్ష్యంగా ముందుకు పోద్దామని కలెక్టర్ జె.వెంకట మురళి పేర్కొన్నారు. స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా శనివారం రాజీవ్‌గాంధీ కాలనీలో ఏర్పాటుచేసిన ర్యాలీని కలెక్టర్ జె వెంకట మురళి, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు కలసి జెండా ఊపి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ దేశంలోనే పరిశుభ్ర రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రతి మూడో శనివారం 'స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివాస్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బాపట్ల ఆర్డీవో గ్లోరియా, బీసీ సంక్షేమ శాఖ అధికారి శివలీల, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, తహసీల్దార్ సలీమా, రెడ్‌క్రాస్ సభ్యులు నారాయణ భట్టు తదితరులు పాల్గొన్నారు.

మౌలికసదుపాయాలు కల్పించాలి

గృహ నిర్మాణ శాఖ ద్వారా ఏర్పాటైన కొత్త లే అవుట్‌లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ జె వెంకట మురళి అధికారులను ఆదేశించారు. గృహ నిర్మాణ శాఖ, అనుబంధ శాఖల అధికారులతో శనివారం స్థానిక కలెక్టరేట్‌లో ఆయన సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 287 లే అవుట్‌లు ఉండగా అత్యవసరంగా 195 సీసీ రోడ్లు నిర్మించాలని గుర్తించినట్లు చెప్పారు. 185 సీసీ డ్రెయిన్‌లు నిర్మించాలన్నారు. 95 లే అవుట్‌లకు సురక్షిత నీరు సరఫరా చేయాల్సి ఉందన్నారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి జి గంగాధర్‌గౌడ్, గృహ నిర్మాణ శాఖ పీడీ వెంకటేశ్వర్లు, అనుబంధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పేదల బతుకులు రోడ్లపాలు

- రోడ్డు విస్తరణలో బలవుతున్న దళితులు
- ముందస్తు సమాచారం లేకుండా ఇష్టానుసారంగా ఇళ్లు కూలుస్తున్న అధికారులు
- మార్కింగ్ కూడా లేకుండా కూలుస్తున్నారని బాధితుల ఆవేదన



నోటీసులు ఇవ్వకుండా తాళం వేసిన ఇంటిని కూల్చిన అధికారులు

జె.పంగులూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి దళితులను టార్గెట్ చేస్తూ, పెద్దలకు కాపు కాస్తోంది. అధికారులు కూడా అదే తీరుగా వ్యవహరిస్తున్నారు. కొన్ని తరాలుగా జాతీయ రహదారి వెంబడి నివాసాలు ఉంటూ, ప్రభుత్వ సహకారంతో గృహాలు నిర్మించుకున్నారు. రహదారి విస్తరణ పేరుతో ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా ఇళ్లు కూల్చివేస్తున్నారు. దీంతో నిలువ నీడ లేక రోడ్డుపైన నిలబడ్డారు. వివరాల్లోకి వెళితే..జె.పంగులూరు మండలం నార్నెవారిపాలెం గ్రామానికి చెందిన దళిత కాలనీ వాసులు జాతీయ రహదారి వెంబడి నివసిస్తుంటారు. 2011లో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా కాలనీకి చెందిన సుమారు 50 మంది ఇళ్లను ఖాళీ చేయించారు. రోడ్డుకు ఇరువైపులా 68 మీటర్ల వరకు విస్తరణ చేశారు. తాజాగా రోడ్డు విస్తరణ చేయాలంటూ అధికారులు పేదల ఇళ్లు పూర్తిగా కూల్చి వేస్తున్నారు. రెవెన్యూ, పోలీసులు అధికారులు దగ్గర ఉండి మరీ కూలుస్తున్నారు. తమకు స్థలాలు చూపించి, వాటిలో ఇళ్లు నిర్మించాకే.. ప్రస్తుతం ఉన్న ఇళ్లు కూల్చాలని కోరుతున్నా పట్టించుకొనేవారే కానరావడంలేదు. రాయపాటి శ్రీనివాసరావు ఇంటికి తాళం వేసి వేరే గ్రామం వెళ్లిన సమయంలో ఇంటిని కూల్చివేశారు.

బౌండరీలు నిర్ణయించాం

ఇళ్లు కూల్చివేత విషయమై జాతీయ రహదారి ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ అధికారులను అడగగా, 2011లోనే ప్రతి ఒక్కరికీ నష్టపరిహారం ఇచ్చామన్నారు. అప్పుడే తాము వారికి బౌండరీలు తెలిపామన్నారు. రెండు నెలల నుంచి నివాసాలు ఏర్పాటు చేసుకొని ఉన్నవారిని ఖాళీ చేయాలని తెలిపామని చెప్పారు. జాతీయ రహదారి బౌండరీ ఎంతవరకు ఉంటుందో అది మొత్తం తాము తీసుకుంటామని తెలిపారు.



ఇంటిని కూల్చ వద్దంటూ ప్రాధేయ పడుతున్న రాయపాటి నాగభూషణమ్మ, హనుమంతరావు

అయ్యా మాకు ఉంది గుడిసే

సారూ.. మాకు కూడు పెట్టే నాథుడు లేడు. కష్టపడి సంపాదించిన డబ్బులతో 15 ఏళ్ల కిందట రోడ్డు పక్క స్థలం కొనుగోలు చేశాం. రిజిస్ట్రేషన్ కూడా చేయించాం. చిన్న రేకుల షెడ్డు వేసుకొని, అక్కడే తినుబండారాలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాం. వంట సమానులోపల ఉండగానే ఇల్లు కూల్చారయ్యా.

–రాయపాటి నాగభూషణమ్మ, భర్త హనుమంతరావు

అధికారులకు స్థలం చూపించాం

జాతీయ రహదారి విస్తరణ కోసం డ్రెయినేజి ఏర్పాటులో భాగంగా వారికి సంబంధించి స్థలాన్ని చూపాలని అడిగారు. వారు కోరిన విధంగా వారికి సంబంధించిన స్థలాన్ని చూపించి మార్కింగ్ ఇచ్చాం.

తహసీల్దార్ సింగారావు, పంగులూరు

ప్రభుత్వమే ఇల్లు నిర్మించి ఇవ్వాలి



నా భర్త వెంకట్రావు 24 ఏళ్ల కిందట అనారోగ్యంతో చనిపోయాడు. అప్పటి నుంచి కూలి పనులకు వెళ్లి పిల్లలను పెంచాను. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా, హడావుడిగా వచ్చి జేసీబీలతో కూలుస్తున్నారు. ప్రభుత్వమే మాకు శాశ్వతంగా ఇల్లు నిర్మించాలి.

– చిరమల మేరిమ్మ

చిన్నతనం నుంచి ఇక్కడే ఉంటున్నా



మా తాతలు, ముత్తాతల తరం అంతా ఇక్కడే గడిచిపోయింది. 2011లో రోడ్డు విస్తరణలో భాగంగా పూరిల్లు కూల్చి రూ.20 వేలు నష్టపరిహారం ఇచ్చారు. అనంతరం అధికారులు ఇచ్చిన పట్టాతో శాశ్వతంగా ఇల్లు నిర్మించుకున్నాం. ఆ ఇంటిలోనే అందరం ఉంటున్నాం. ప్రస్తుతం అధికారులు వచ్చి కూల్చి వేస్తామని బెదిరిస్తున్నారు. కూలి చేసుకొని బతుకుతున్నాం. పొమ్మంటే ఎక్కడికి పోవాలి?

– నాగిపోగు ఏసురత్నం

రంగస్థలంతో సామాజిక చైతన్యం



నాటిక పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి, పొడపాటి తేజశ్విని తదితరులు

ముగిసిన ఎన్టీఆర్ కళాపరిషత్ నాటిక పోటీలు

యద్దనపూడి: సమాజంలోని వాస్తవ పరిస్థితులను ఎప్పటికప్పుడు అవలోకం చేసుకుంటూ ప్రజల కష్టాలను, కడగండ్లను ప్రేక్షకుల దృష్టికి తీసుకువచ్చే నాటకం మానవజీవితానికి దర్పణం వంటిందని పర్చూరు శాసనసభ్యుడు ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. మండలంలోని అనంతవరం గ్రామంలో ఎన్టీఆర్ కళాపరిషత్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఉభయ తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలకు శనివారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ మరో ముఖ్య అతిథిగా ఏపీ క్రియేటివ్ కల్చర్ కమిషన్ చైర్మన్ పొడపాటి తేజశ్విని, రచయిత, దర్శకులు కందిమళ్ల సాంబశివరావు హాజరయ్యారు. ఏలూరి మాట్లాడుతూ నాటకంలోని పాత్ర తీరుతెన్నులు, స్వభావాన్ని చూపుతూ... తమ నటనా చాతుర్యంతో ప్రేక్షకుల హృదయాలను రంజింపచేయటం సులువేమీ కాదన్నారు. పాత్రలో పరకాయ ప్రవేశం చేస్తేనే ప్రేక్షకులను మెప్పించటం సాధ్యమవుతుందని వివరించారు. అలాంటి కళాకారులను నాటక పరిషత్‌ల ద్వారా ప్రోత్సహించటం అభినందనీయమన్నారు. పొడపాటి తేజశ్విని మాట్లాడుతూ నాటకాల ద్వారా సమాజానికి ఉపయోగపడే సందేశాత్మక అంశాలు ఎన్నో మిళితమై ఉంటాయన్నారు. మనస్సు దోచే సన్నివేశాలతో నవరసాలను అలవోకగా పలికిస్తూ ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేసే కళామతల్లి ముద్దుబిడ్డలైన కళాకారులను గౌరవించుకోవాల్సిన ఆవశ్యకత అందరిపై ఉందన్నారు. అనంతవరం కళా పరిషత్ అధ్యక్షుడు గుదే పాండురంగారావు మాట్లాడుతూ మండలంలో మూడేళ్లుగా కళాపరిషత్ ద్వారా రాష్ట్రస్థాయి నాటిక పోటీలను విజయవంతంగా నిర్వహిస్తున్నామని నాటికలోని సందేశాలను గ్రహించి కొంతమందైనా మంచి మార్గంలో పయనిస్తే తమ లక్ష్యం నెరవేరినట్లేనన్నారు. కార్యక్రమంలో కొరిటాల వంశీకృష్ణ, గుదే తారకరామారావు, మద్దినేని జయరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రంజింపజేసిన నాటికలు

తొలినాటికగా అరవింద ఆర్ట్స్ తాడేపల్లి వారి విడాకులు కావాలి నాటికలో దాంపత్య జీవితంలో ఆలుమగలు మధ్య అభిప్రాయభేదాలు, అపోహలు తలెత్తటం సహజం. అంతమాత్రం చేతే పంతాలకు పట్టుదలకు పోయి విడాకులు తీసుకోవాలనుకోవటం ఎంతవరకు సమంజసం..? ఎటువంటి అపార్థాలకు తావులేకుండా సర్దుబాటు ధోరణిలో సంయమనం పాటించటం వల్ల ఆదర్శ దంపతుల్లా గడపచ్చు అంటూ నాటిక ఆద్యంతం ఆలోచింపజేసింది.



విడాకులు కావాలి నాటికలోని ఓ సన్నివేశం

ఆలోచనలు రేకెత్తించిన 'అసత్యం'

చైతన్య కళాస్రవంతి విశాఖపట్నం వారి అసత్యం నాటికలో ...దైవత్వమైనా, రాక్షసత్వమైనా అది మనిషి హృదయంలో ఉంటుంది. ప్రతి సత్యం వెనుక, ప్రతి అసత్యం వెనుక మనిషి స్వార్థమో, భయమో ఉంటుంది. అదే అతనికి మేలో, కీడో చేస్తుంది. అసలు ఏది సత్యం..? ఏది అసత్యం. కంటికి కనిపించేది అంతా సత్యం కాదు...కనపించనిదంతా అసత్యం కాదు. యథార్థమైనా సరే ఒక చెడుకు దోహదపడితే అది అసత్యం. అబద్ధమైనా సరే అది ఒక మంచికి దోహదపడితే అది సత్యం. అనేదే (అ) సత్యం కథ సారాంశం.

జనరల్ బోగీలు

మూడో నాటికగా శ్రీసాయి ఆర్ట్స్ కొలకలూరు వారి జనరల్ బోగీలు నాటికలో ...రైలు ప్రమాదాలు జరిగినప్పుడు జనరల్ బోగీల్లో ప్రయాణించేవారి వివరాలు ఉండవని, ప్రమాదవేళల్లో బాధితుల వేదన వర్ణనాతీతమని వివరించారు. ఈ దౌర్భాగ్యం పోవాలని జనరల్ బోగీలు సంఖ్య పెంచాలని ప్రయాణికుల వివరాలు రైల్వే వారి దగ్గర ఉండాలని రైలు ప్రమాదంలో గల్లంతైన తన కొడుకు ఆచూకీ కోసం ఓ తల్లి చేసిన పోరాటమే జనరల్ బోగీలు నాటిక సారాంశం.

సత్ప్రవర్తనతో మెలగండి

సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు

రేపల్లెరూరల్: ఖైదీలు సత్ప్రవర్తనతో కూడిన జీవితాన్ని అవలంబించాలని సీనియర్ సివిల్ జడ్జి టీ.వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని సబ్‌జైలులో శనివారం రిమాండ్ ఖైదీలకు చట్టాలపై అవగాహన కల్పించి మాట్లాడారు. క్షణికావేశంలో చేసే తప్పిదాలతో తమతోపాటు తమ కుటుంబ సభ్యులు కూడా జీవితాలను కోల్పోవాల్సిన పరిస్థితులు ఉంటాయన్నారు. పగ, ప్రతీకారాలను వీడి శాంతియుతంగా జీవించాలని సూచించారు. చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని చెప్పారు. అనంతరం జైలులో ఖైదీలకు అందుతున్న వసతులపై ఆరా తీశారు. వివిధ రకాల చట్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి రూపశ్రీ, సబ్‌జైల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



రిమాండ్ ఖైదీలకు సూచనలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు

తెనాలి-గుంటూరు నాన్‌స్టాప్ సేవలు పునఃప్రారంభం

తెనాలి అర్బన్: తెనాలి-గుంటూరు నాన్‌స్టాప్ బస్సు సర్వీసులను పునఃప్రారంభించినట్లు ఆర్టీసీ తెనాలి డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్ పేర్కొన్నారు. బస్సు సర్వీసులను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాల మేరకు బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం ఆరు గంటల నుంచి రాత్రి 9.30 గంటల వరకు సర్వీసు ఉంటుందన్నారు. ప్రతి 30 నిమిషాలకు ఒక బస్సును ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రయాణికులంతా ఈ సేవలను ఉపయోగించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ప్రసాద్, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

దేహదారుఢ్య పరీక్షల్లో 312 మంది అర్హత


పరుగు పందెం పోటీల్లో అభ్యర్థులు


ఛాతీ కొలతను చూస్తున్న పోలీస్ అధికారులు

నగరంపాలెం: కానిస్టేబుళ్ల అభ్యర్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ అన్నారు. నగరంపాలెం పోలీస్ పరేడ్ మైదానంలో కొనసాగుతున్న దేహ దారుఢ్య పరీక్షలను జిల్లా ఎస్పీ పరిశీలించారు. అభ్యర్థుల ఛాతీ, ఎత్తు కొలతలు, ధ్రువీకరణ పత్రాల పరిశీలన, పరుగు పందెం పోటీల నిర్వహణను జిల్లా ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. 529 మంది అభ్యర్థుల్లో 95 మంది ధ్రువపత్రాలు తేవకపోవడంతో వెనుదిరిగారు. 434 మందికి దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించగా 312 మంది అర్హత సాధించారు. 43 మందిని ఛాతీ, ఎత్తు కొలతలు సరిపోకపోవడంతో తిరస్కరించారు. మిగతా 391 మందికి 1600 మీటర్ల పరుగు పందెం పోటీలు జరగ్గా, 70 మంది అనర్హులుగా ప్రకటించారు. 321 మందికి 100 మీటర్ల పరుగు పందెం పోటీల్లో 170 మంది అర్హత సాధించారు. 319 మందికి లాంగ్ జంప్ పోటీలు చేపట్టగా, వారిలో 311 మంది అర్హత సాధించారు. జిల్లా ఏఎస్పీలు ఏవీ.రమణమూర్తి (పరిపాలన), ఎ.హనుమంతు (ఏఆర్) పర్యవేక్షించారు.

300 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



నిజాంపట్నం: నాటుసారా తయారీకి ఉపయోగించే బెల్లం ఊటను ధ్వంసం చేసిన సంఘటన మండలంలోని అదవల గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ రేపల్లె, నగరం సీఐలు దివాకర్, శ్రీరామ్ ప్రసాద్‌లు తెలిపిన వివరాల మేరకు.. అదవల గ్రామ పరిసరాలలోని మడ అడవులలో నాటు సారా తయారు చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు దాడులు నిర్వహించారు. నాటు సారాకు వినియోగించే 300 లీటర్ల బెల్లం ఊట లభించింది. బెల్లం ఊటను ధ్వంసం చేశారు. తయారీదారులను త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని సీఐ చెప్పారు. అదవలతోపాటు సమీపంలోని పలు గ్రామాలలో తమ నిఘా ఉందన్నారు. ఎవరైనా నాటుసారా తయారు చేసినా, విక్రయించినా, నాటు సారాకు అవసరమైన ముడి సరుకులు విక్రయించినా చట్టపరమైన చర్యలు ఎదుర్కొనక తప్పదని హెచ్చరించారు. దాడులలో సిబ్బంది కె.శ్రీనివాసరెడ్డి, కె.మధుసూదనరావు, పి.శ్రీనివాసరెడ్డి, కే.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి



మార్టూరు: జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన ఇసుక దర్శి గ్రామ సమీపంలో శనివారం మధ్యాహ్నం జరిగింది. స్థానికులు, సీఐ మద్దినేని శేషగిరి రావు వివరాలు.. ఇసుక దరిసి గ్రామానికి చెందిన దోరక నాగిరెడ్డి (54)స్థానిక ఏలూరి క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం కాలి నడకన ఇంటికి వెళుతున్నాడు. ఈ క్రమంలో జాతీయ రహదారిలో తూర్పు వైపు నుంచి పడమర వైపు దాటుతుండగా.. మార్టూరు నుంచి ఒంగోలు వైపు వెళ్లే వాహనం నాగిరెడ్డిని బలంగా ఢీ కొట్టి వెళ్లిపోయింది. ప్రమాద తీవ్రతకు అతను అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య, పిల్లలు ఎవరూ లేని అనాథ అయిన నాగిరెడ్డి రెండు దశాబ్దాలుగా గ్రామంలోని వడ్డెర కాలనీవాసులతో కలిసి ఒక్కడే నివసిస్తున్నాడు. నాగిరెడ్డి ఇంటి సమీపంలో ఉండే అచ్చి పున్నారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న సీఐ శేషగిరిరావు నాగిరెడ్డి మృతదేహానికి మార్టూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టు మార్టం నిర్వహించారు. మృతదేహాన్ని కాలనీవాసులకు అప్పగించగా వారే అంత్యక్రియలు పూర్తి చేశారు.

కొండవీడు కొండల్లో మహిళా కేడెట్ల ట్రెక్కింగ్



గుంటూరుఎడ్యుకేషన్: ఏపీ ట్రెక్-3 కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు చెందిన మహిళా ఎన్‌సీసీ కేడెట్లు శనివారం కొండవీడు చెక్ పోస్టు నుంచి చారిత్రక కొండవీడు కోట వరకు ఏడు కిలోమీటర్లు ట్రెక్కింగ్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు. గుంటూరు ఎన్‌సీసీ గ్రూప్-10 ఆంధ్ర గరల్స్ బెటాలియన్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎన్‌సీసీ డైరెక్టరేట్ సంయుక్తంగా అఖిల భారత మహిళా ట్రెక్కింగ్-3 పేరుతో శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా తొమ్మిది ఎన్‌సీసీ గ్రూపులకు చెందిన కేడెట్లు ట్రెక్కింగ్‌లో పాల్గొన్నారు. అనంతరం రెడ్డిరాజుల వారసత్వ మ్యూజియాన్ని సందర్శించారు. కొండవీడుకోట చరిత్ర, ప్రాముఖ్యత గురించి సమాచారాన్ని తెలుసుకున్నారు. గుంటూరు ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ కల్నల్ ఎస్.ఎం. చంద్రశేఖర్ మాట్లాడుతూ శారీరక శక్తి పరీక్షతో పాటు చారిత్రక అవగాహన కలిగించేందుకు ఏర్పాటు చేసిన ట్రెక్కింగ్ శిబిరంలో మహిళా కేడెట్లు ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ప్లంబర్ వర్క్‌పై ఉచిత శిక్షణ కల్పించనున్నట్లు జిల్లాస్థాయి పారిశ్రామిక శిక్షణ సంస్థ (డీఎల్‌టీసీ) అసిస్టెంట్ డైరెక్టర్ బి.సాయివరప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు టెన్త్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, ఆధార్‌తో లింకైన మొబైల్ నంబరు వివరాలతో సంప్రదించాలని సూచించారు. ప్లంబర్ కోర్సు ద్వారా అపార్ట్‌మెంట్లు, గృహాల్లో పైప్ ఫిట్టింగ్ ద్వారా స్వయం ఉపాధి అవకాశాలతో పాటు పరిశ్రమల్లో ఉపాధిని పొందవచ్చని తెలిపారు. వివరాలకు 80746 07278, 83339 73929 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

రూ.2.50 కోట్లు అప్పులు చేసి

ఎరువుల వ్యాపారి ఉడాయింపు

మాచర్ల: పట్టణంలో ఎరువుల వ్యాపారి రూ.2.50కోట్లు అప్పు చేసి పది రోజులుగా కనిపించకుండా వెళ్లిపోయాడు. వ్యాపారి ఆచూకీ కోసం అప్పులు ఇచ్చిన వారు ఆందోళనలో ఉన్నారు. పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ సమీపంలో గత కొన్ని సంవత్సరాలుగా ఎరువుల వ్యాపారం చేస్తూ చిట్టీపాటల వారికి డబ్బులు ఇవ్వకుండా వెళ్లిపోయాడు. బంధువులు, స్నేహితులు, తదితర వారి వద్ద రూ. 2.50 కోట్ల వరకు అప్పు చేశాడు. దుకాణానికి తాళాలు వేసి కనిపించకుండా వెళ్లిపోయాడు. అప్పులు ఇచ్చిన వారు ఆందోళన చెందుతున్నారు. వ్యాపారి కోసం గాలింపులు చేస్తున్నారు. బాధితులు పోలీసులను ఆశ్రయించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇంతకు ముందు కూడా ఇలాంటి ఘటన చేసి పెద్దలతో మాట్లాడుకుని గ్రామంలోకి అడుగు పెట్టాడు. జనంలో నమ్మకం పెంచుకుని అప్పులు చేసి మళ్లీ కనిపించకుండా పోవడంపై పట్టణంలో చర్చ జరుగుతోంది.

మొక్కలు నాటి సంరక్షించాలి

నరసరావుపేట: పర్యావరణమే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి చెట్లుగా పెంచి ఆక్సిజన్ లభ్యతను పెంచాల్సిన అవసరం ఉందని జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి పేర్కొన్నారు. వరల్డ్ అగ్రి ఫారెస్టు సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ట్రీస్ అవుట్‌సైడ్ ఫారెస్టు ఇన్ ఇండియా(టోఫీ) కార్యక్రమంలో భాగంగా మాస్టర్ ట్రైనర్లకు సర్టిఫికేట్లు అందజేసే కార్యక్రమం శనివారం మున్సిపల్ అతిథి గృహంలో నిర్వహించారు. మురళి మాట్లాడుతూ దేశంలో ఉన్న భూ విస్తీర్ణంలో 30 శాతం అటవీ ప్రాంతం ఉండాల్సిన అవసరం ఉందన్నారు. కోవిడ్ సమయంలో ప్రతి ఒక్కరూ ఆక్సిజన్ కోసం వెంపర్లాడిన పరిస్థితి ఒక్కసారి గుర్తు చేసుకోవాలని కోరారు. మొక్కలు నాటి చెట్లుగా పెంచటమనేది ఒక సోషల్ యాక్టివిటీగా మారాలని కోరారు. ఉద్యాన శాఖ జిల్లా అధికారి సీహెచ్.వి.రమణారెడ్డి మాట్లాడారు.

ఎన్టీఆర్ సేవలు అజరామరం

రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్


ఎన్టీ రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

రేపల్లె రూరల్: సాధారణ ఉద్యోగిగా తన జీవితాన్ని ప్రారంభించి సినీ నటునిగా, రాష్ట్ర రాజకీయాలలో రాణించి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రజలకు ఎన్టీ రామారావు అందించిన సేవలు ఎనలేనివని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జానపద, పౌరాణిక చిత్రాలలో నటించి విమర్శకుల మన్ననలు పొందారన్నారు. పార్టీని స్థాపించిన అనతి కాలంలోనే ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి తెలుగు భాష కీర్తిప్రతిష్ఠలను దశదిశల వ్యాప్తి చేసిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందని అన్నారు. అటువంటి నాయకుడిని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పంతాని మురళీధరరావు, గూడపాటి శ్రీనివాసరావు, అనగాని శివప్రసాద్, జీవీ నాగేశ్వరరావు, దేవగిరి రవిశంకర్, కొమ్మూరి వెంకటేష్, మేకా వెంకట శివ రామకృష్ణ, పంతాని సాయికుమార్, కొలసాని రాము, వెనిగళ్ల సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.